క్లుప్తంగా

కరాటేలో విద్యార్థిని సత్తా

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె.శరణ్య రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కె.నరేష్ ఆదివారం తెలిపారు. ఇటీవల విజయనగరంలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో అండర్–14 విభాగంలో శరణ్య మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ందన్నారు. త్వరలో అనంతరపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని తెలిపారు.

సరుగుడు పత్రం పేస్టు తయారీపై అవగాహన

బలిజిపేట: మామిడి, జీడి, పనస వంటి పండ్ల చెట్లకు కాండం తొలిచే పురుగు నివారణకు సరుగుడు పత్రం పేస్ట్ ఉపయోగపడుతుందని ఐసీఆర్‌పీలు ఆదిలక్ష్మి, తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని మిర్తివలసలో ఆదివారం పేస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐదు కిలోల సరుగుడు ఆకును తీసుకుని 25 లీటర్ల నీటిలో ఉడికించి వడకట్టాలన్నారు. ఆ మిశ్రమంలో 15 కిలోల ఆవుపేడ, 15 కిలోల బంకమట్టి, 15 కిలోల ఇసుక పోసి బాగా కలియబెట్టాలని తెలిపారు. కొద్దిసేపటి తర్వాత 15 కిలోల గోమూత్రం వేసి బాగా కలుపుకుని, ఆపేస్టును మామిడి, జీడి, పనస చెట్ల కాండాలకు పూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



గ్రామ సంఘాల రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

పార్వతీపురం టౌన్: మండలంలోని లక్ష్మీ నారాయణపురంలో కేంద్రబృంద సభ్యులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వెలుగు మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి, ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణాలు జీవనోపాధికి ఎలా ఉపయోగించారో అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు మహిళలు తీసుకున్న రుణాలు, వినియోగించే విధానాన్ని వివరించారు. రికార్డుల నిర్వహణపై బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజా ప్రతినిధులకు శిక్షణ

● ఎంపీడీఓ త్రివిక్రమరావు



సీతానగరం : గ్రామ పంచాయతీల బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాలు అమలుకు సంబంధించి ఉప సర్పంచ్‌లు, ఇద్దరు వార్డు మెంబర్లకు సోమవారం నుంచి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ప్రజా ప్రతినిధుల విధి విధానాలపై జిల్లా కోర్సు డైరెక్టర్ల ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. సమాచారం తెలియజేసిన వార్డు మెంబర్లు, పంచాయతీ ఉప సర్పంచ్‌లు శిక్షణకు హాజరుకావాలని కోరారు. శిక్షణా సమయంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు.

చెట్టును ఢీ కొన్న ట్యాంకర్



నుజ్జునుజ్జు అయిన ట్యాంకర్ లారీ

సీతానగరం: మండలంలోని అంటిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ (బండిని) వాహనాన్ని తప్పించబోయిన లారీ చింతచెట్టును ఢీ కొట్టడంతో డ్రైవర్‌కు గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రాయగడ నుంచి విశాఖ వైపు వస్తున్న ట్యాంకర్ అంటిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ కె.రమణకు తీవ్ర గాయాలయ్యాయి.

రాష్ట్రంలో మతతత్వ రాజకీయాలు

బలిజిపేట: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మతత త్వ రాజకీయాలను ప్రేరేపిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆరోపించారు. మండలంలో ని పెద్దింపేటలో సీపీఎం జెండాను గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు సాంబమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహాసభలో ఇటీవల మృతి చెందిన పార్టీ అగ్ర నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం ప్రజా సమస్యలను పక్కనబెట్టి, మతతత్వ రాజకీయాలు చేస్తున్నాయన్నారు.

వంట నూనె ధరకు రెక్కలు

- దిగుమతి సుంకం పెంపుతో భారీగా పెరిగిన ధరలు
- సగటున జిల్లాలో నెలకు 18–20 లక్షల లీటర్ల నూనె వినియోగం
- లీటరుపై కనిష్టంగా రూ.20 పెంపుదల
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న కొందరు వ్యాపారులు



ఏజెన్సీ సంతల్లో నాసిరకం వంటనూనె, సరుకుల అమ్మకాలు

పాలకొండ రూరల్: నియంత్రణ లేకపోవటంతో వంటనూనె ధరలు రోజురోజుకు సలసల కాగుతున్నాయి. ఆ వేడిలో సగటు వినియోగదారులు వేగిపోతున్నాడు. గడిచిన వారం నుంచి వంటనూనె లీటరు ధర రూ.15 నుంచి 20 వరకు పెరిగింది. పామాయిల్, సన్‌ఫ్లవర్ ధరలు పెరిగాయి. వంట నూనెలపై దిగుమతి సుంకం భారీగా పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఆ మరుక్షణమే రిటైల్ విక్రయదారులు లీటరుపై రూ.15లు చొప్పున ధర పెంచేశారు. దిగుమతి సుంకానికి అదనంగా 5 శాతం స్టాండెడ్ సెస్, 10 శాతం అగ్రికల్చర్ సెస్ యాడ్ అవుతుంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.105 నుంచి రూ.130 వరకు పెరిగింది. చిల్లర దుకాణాల్లో ఇంకో రూ.5లు ఎక్కువగానే అమ్ముతున్నారు. పామాయిల్ ధర రూ.95 నుంచి రూ.120 రూపాయలకు పెరిగింది. వేరుశనగ రూ.145 నుంచి రూ.170కు, దీపారాధన ఆయిల్ రూ.108 నుంచి రూ.131కి పెరిగింది. సన్‌ఫ్లవర్ 15 కేజీల డబ్బా ధర రూ.1,750 నుంచి రూ.2,100లకు ఎగబాకింది. పామాయిల్ డబ్బా రూ.1,520 నుంచి రూ.1,820లకు పెరిగింది. రైస్ బ్రాన్ ఆయిల్ లీటర్ రూ.120 నుంచి రూ.140కి పెరిగింది. ఒక్కసారిగా ధర పెరగడంతో వినియోగదారులు అల్లాడి పోతున్నారు. దిగుమతి సుంకం పెంచడంతో దళారులు రంగంలోకి దిగారు. ఉన్న ఆయిల్ గోడౌన్లలో నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి ఇంకా ధరలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్యుల వంటింటి బడ్జెట్ తలకిందులయ్యింది. తాజాగా వంట నూనెల ధరలపై దిగుమతి సుంకం పెంచడంతో సామాన్యులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. కేంద్రం నిర్ణయంతో వ్యాపారులు తమ గోడౌన్లలో ఉన్న పాత సరుకునే కొత్త ధరకు విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు.



మార్కెట్లో విక్రయిస్తున్న వంటనూనె

ప్రజలపై రూ.కోట్ల మేర భారం..

జిల్లాలో దాదాపు 24లక్షల మంది జనాభా, సుమారు 4లక్షల కుటుంబాలు ఉన్నట్లు ఓ అంచనా. వీరితో పాటు నూనె ఆధారంగా తినుబండారాలు తయారు చేసి అమ్మకాలు చేపడుతున్నవారితో కలిపి సగటున జిల్లాలో నెలకు 18–20 లక్షల లీటర్ల నూనె వాడకం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కసారిగా లీటర్‌పై కనిష్టంగా రూ.20 పెరిగినందున నెలకు రూ.3.60 కోట్లకు పైగా అదనపు భారాన్ని జిల్లా ప్రజలు మోయాల్సి వస్తోంది. దసరా, దీపావళి వంటి పండుగలు వరుసగా ఉన్న నేపథ్యంలో నూనె వాడకం భారీగా పెరగనుంది. ఈ మేరకు సామాన్యులపై మరింత భారం పడనుంది.

పండుగల వేళ ధరలు..

ఇప్పటికే కూరగాయలు, పప్పులు, ఉప్పులు ధరలకు రెక్కలొచ్చాయి. పండుగల సమయంలో వంటనూనె ధరలు కూడా పెరగడంతో వినియోగదారులు భయపడుతున్నారు. వరుస పండగలుండటంతో నూనె, ఇతర నిత్యావసర సరుకుల ధరలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంటనూనె ధరలు పెరగడం వల్ల ఈ ప్రభావం ఇతర ఆహార పదార్థాలపై పడి వాటి ధరలు పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని తగ్గించి ప్రజలపై భారం వేయకుండా చూడాలని, బ్లాక్ మార్కెటింగ్ ద్వారా గోడౌన్లలో దాచిన వంట నూనె నిల్వలను బయటకు తీసుకొస్తే రేట్లు పెరుగుదలను నివారించవచ్చని వినియోగదారులు, వినియోగదారుల ఫోరం ప్రతినిధులు సూచిస్తున్నారు.

కల్తీకి అవకాశం..

మార్కెట్లో వంట నూనె ధరలు పెరగడంతో అక్రమార్కులు జూలు విదిల్చే అవకాశాలు ఉన్నాయి. విడి విక్రయాల పేరుతో కల్తీ వ్యాపారానికి తెరలేపే ప్రమాదం ఉంది. రోడ్డు పక్కన ఉండే అల్పాహారశాలలు, చిన్న హోటళ్లు, మాంసాహార దుకాణాల వారు ఎక్కువగా విడిగా వంట నూనె కొనుగోలు చేస్తుంటారు. సమీప పట్టణ ప్రాంతాల నుంచి పల్లెలకు ఈ తరహా నూనె రవాణా అయ్యే అవకాశాలు ఉన్నాయి. పట్టణంతో పాటు పల్లెల్లో కిరాణా దుకాణాల్లోనూ విడిగా నూనె విక్రయాలు జరుగుతున్నాయి. ఈ అమ్మకాల్లో కల్తీలకు అవకాశం ఉంటుంది. జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం అధికంగా ఉండటం అక్రమార్కులకు కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు.

తనిఖీలు చేయాలి



నూనె దుకాణాలను వెంటనే తనిఖీలు చేసి, పాత స్టాకు ఎంత ఉంది, పాత స్టాకు ఉన్నంత వరకు పాత ధరలకే విక్రయాలు జరిగే విధంగా వాణిజ్య శాఖ అధికారులు చొరవ చూపాలి. అధికారిక తనిఖీలు లేకపోవటంతో వ్యాపారుల ఆటలు సాగుతున్నాయి. వినియోగదారుని అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలకు సరుకులు విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, వారపు సంతల్లో అమాయకులకు అధిక ధరలకు సరుకులు కట్టబెడుతున్నారు. ఇది పండగల సీజన్ కావటంతో వినియోగదారులను మరింత దోచేసే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గోడౌన్లపై దాడులు నిర్వహించి ధరలను కట్టడి చేయాలి.

– ముంజి శివున్నాయుడు, విశ్రాంత ఉద్యోగి, పాలకొండ

అధికారుల సమన్వయంతో..



వినియోగదారున్ని మోసం చేయటం చట్టరీత్యా నేరం. మా సిబ్బందితోపాటు లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ అధికారులతో కలిసి కృత్రిమ కొరత, నాణ్యత లోపాలు, అధిక ధరల నియంత్రణపై విస్తృత దాడులు చేపడుతున్నాం. ఇటీవల జిల్లా పరిధిలో నాలుగు చోట్ల చేపట్టిన దాడుల్లో శాంపిల్స్ సేకరించాం. సంబంధిత అధికారుల సమన్వంతో కొరత సృష్టించి అధిక ధరలు, కల్తీ, తూనికల్లో వ్యత్యాసాలు లేకుండా చర్యలు చేపడుతాం. వినియోగదారులు ఈ తరహా సమస్యలు గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలి. ముఖ్యంగా ఏజెన్సీ కలబోసి ఉన్న జిల్లాలో వారపు సంతలు, గ్రామీణ ప్రాంత వ్యాపారులపై కూడా దృష్టి పెడతాం.

– ఏపూరి రామయ్య, ఆహార భద్రత అధికారి, పార్వతీపురం మన్యం

జగన్మాతా.. పాహిమాం..



పాలకొండ: లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో కోటదుర్గమ్మ



వీరఘట్టం: రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చిన కోటదుర్గమ్మ



భామిని: బాలా త్రిపుర సుందరీ ఆలంకరణలో దుర్గామాత



వీరఘట్టం: రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చిన కోటదుర్గమ్మ



పాలకొండ: అమ్మవారి ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు

వీరఘట్టం: అమ్మా.. జగన్మాతా.. రాజరాజేశ్వరీ పాహిమాం.. రక్షమాం.. అంటూ భక్తులు ఆదివారం కోటదుర్గ ఆలయంలో పూజలు చేశారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వీరఘట్టం వాసుల ఇలవేల్పు కోటదుర్గ తల్లి భక్తులకు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో భవానీ భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. జై భవానీ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కిమ్మి గ్రామంలో భవానీ భక్తులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

పాలకొండలో ఆధ్యాత్మిక శోభ

పాలకొండ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాలకొండ కోటదుర్గమ్మ ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలో పలు కాలనీల నుంచి మహిళలు ఘటాలతో తరలివచ్చి అమ్మవారికి సంబరాలు చేపట్టారు. ఆలయ ఆవరణలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. పరిసరాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులకు మజ్జిగ, అన్నసమారాధన చేశారు. ఆలయం వద్ద ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోకుండా డీఎస్పీ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



పాలకొండ: అమ్మవారి దర్శనం కోసం క్యూలో నిలుచున్న భక్తులు

బాలాత్రిపుర సుందరీగా..

భామిని: మండలంలోని బత్తిలిలో కోటదుర్గమ్మ సన్నిధిలో ప్రతిష్ఠించిన దుర్గామాతాను ఆదివారం బాలా త్రిపుర సుందరిగా అలంకరించారు. భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు.



పాలకొండ: ప్రధాన రహదారిలో ఘటాలతో తరలివస్తున్న వందలాది మంది మహిళలు



పాలకొండ: భక్తులకు మజ్జిగ పంపిణీ

కందిపప్పు కొంతమందికేనా..



గడ్డికాలనీలో కందిపప్పు లేకుండా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్

గుమ్మలక్ష్మీపురం: ఈనెలలో రేషన్ పంపిణీలో భాగంగా బియ్యం, పంచదారతో పాటు కొంత మందికే కంది పప్పును అందివ్వడం పట్ల రేషన్ కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో కిలో కంది పప్పు రూ.160లు ఉండగా.. జీసీసీ ద్వారా కొంత మందికి కిలో రూ.67లకు అందించి, మిగతా వారికి అందిచకపోవడంతో తామేమి అన్యాయం చేశామని, తమకెందుకు పప్పు ఇవ్వడం లేదంటూ సేల్స్‌మేన్లు, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను కార్డుదారులు నిలదీస్తున్నారు. ఈ విషయాన్ని జీసీసీ గొడాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు వద్ద ప్రస్తావించగా ఐదు నెలల తర్వాత మరలా ఇప్పుడు డీఆర్ డిపోలకు సరఫరా చేసేందుకు కందిపప్పు వచ్చిందన్నారు. తమ పరిధిలో గల 35 డీఆర్ డిపోలకు సరఫరా చేసేందుకు మొదటి విడతగా 12 క్వింటాళ్ల కంది పప్పు రావటంతో ఒక్కో డిపోకు 85 కందిపప్పు ప్యాకెట్ల చొప్పున్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేటాయించినట్లు చెప్పారు. మొదటగా వచ్చిన కార్డుదారులకు వారిటి అందజేయాలని ఎండీయూ ఆపరేటర్లకు చెప్పడం జరిగిందన్నారు. రిమైనింగ్ పప్పు వచ్చిన వెంటనే కార్డుదారులందరికీ అందజేయడం జరుగుతుందన్నారు.

కషాయాలతో ప్రయోజనం

గుమ్మలక్ష్మీపురం:



రైతులతో కషాయాలు తయారు చేయిస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జ్ భూషణరావు

జిల్లేడు ద్రావణం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలతో పంటలకు ప్రయోజనముందని ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం యూనిట్ ఇన్‌ఛార్జ్ కిమిడి భూషణరావు అన్నారు. మండలంలోని ఎలిన్‌పేట పంచాయతీ జే.కే పాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేస్తున్న రైతులకు వివిధ రకాల కషాయాల తయారీపై శిక్షణ ఇచ్చారు.

రైతులతో జిల్లేడు, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం కషాయాలను తయారు చేయించారు. ఈ కషాయాలను పంటలపై పిచికారీ చేయడం ద్వారా సుడి దోమ, దోమపోటు తెగుళ్లను నివారించడంతో పాటు పోటాష్ లోపాన్ని అరికట్టవచ్చన్నారు. తద్వారా పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది దీప, పద్మ, చామంతి, తదితరులు పాల్గొన్నారు.

రావుపల్లిలో ఉచిత వైద్యశిబిరం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో పార్వతీపురం ధన్వంతరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు ఎం.చాందిని, బి.రవికుమార్ సుమారు 100 మంది రోగులకు తనిఖీలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని, అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ప్రమాదమని అన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

పాలకొండ రూరల్:

పట్టణ పరిధిలో పారిశుద్ధ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలని సీఐటీయూ నాయకుల దావాల రమణారావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణం నానాటికి విస్తరిస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లు పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. శాశ్వత డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణతో ప్రజారోగ్య రక్షణకు బాటలు వేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆ దిశగా అడుగులు వేయాలని కోరారు. అలాగే ఉచిత ఇసుక అందించటంతో ప్రభుత్వ తీరును స్వయం పునఃపరిశీలన చేయాలన్నారు. ప్రస్తుత విధానంతో భవన నిర్మాణ వ్యవస్థల్లో ఏర్పడుతున్న ఇబ్బందులు గుర్తించాలన్నారు.

గ్రామదేవతకు పూజలు

భామిని: మండలంలోని నేరడి–బిలో గ్రామదేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా పండగకు ముందు వచ్చే ఆదివారం గ్రామదేవతలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. పాతపట్నం కుటుంబీకులు మేళతాళాలతో అమ్మవారి ఘటాలు, నైవేద్యాన్ని పట్టుకొని ఊరేగింపుగా తరలివచ్చి పూజలు చేశారు.

నిఘా విస్తృతం చేయాలి

పాలకొండ రూరల్: వరుస పండగల నేపథ్యంలో నిషేధిత క్రీడల జోలికి పోవద్దని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. ఆదివారం తమ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పండగలను ఆసరాగా చేసుకుని గ్రామాల్లో పేకాట శిబిరాలు, పాట్టీల్ల పందేలు నిర్వహించినా, వాటిని ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామస్థాయిలో గల సచివాలయ మహిళా పోలీస్ వ్యవస్థ ద్వారా క్షేత్ర స్థాయిలో నిఘా మరింత విస్తృతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తులు, అనుమానితులపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, అవసరమైన సమయంలో మళ్లింపునకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.


నేటి నుంచి వార్డు మెంబర్లకు శిక్షణ

భామిని: మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలోని ఉప సర్పంచ్‌తో పాటు మరో ఇద్దరు వార్డు మెంబర్లకు రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.చందరరావు ఆదివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శుల ద్వారా స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపినట్లు తెలిపారు.

సిరులొలికించే ధాన్యలక్ష్మి..

పాలకొండ రూరల్: రైతన్నల రెక్కల కష్టంకు పండే పంటే సేదతీరుస్తుంది. ఈ ఏడు ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వాతావరణం ప్రతికూలంగా ఉంటంతో పాటు ప్రభుత్వం నుంచి క్షేత్రస్థాయిలో ఎటువంటి సహకారం లభించకపోయినా అన్నదాతలు తమ కష్టాన్ని నమ్ముకుని పంటలు సాగుచేశారు. వరుస వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేసినా భగవంతునిపై భారం వేసి ముందుకుసాగారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా అప్పులు చేసి మరీ మదుపులు పెట్టారు.

ఈ క్రమంలో గత ప్రభుత్వం అందించిన తోడ్పాటును గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం వరిపంట చిరుపొట్ట దశకు చేరుకుంది. పంటభూములన్నీ పచ్చదనం పరచుకుని ఆహ్లాదంగా కనిపిస్తున్నాయి. సిరులొలికించే ధాన్యలక్ష్మిని చూస్తూ కర్షకులు తమ కష్టాన్ని మైమరిచపోతున్నారు.



తుమరాడ వద్ద చిరుపొట్ట దశలో వరిపంట

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సాలూరు: అంగన్‌వాడీలు, మినీ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.ఉమామహేశ్వరి డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీల సమస్యలపై పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మినీ వర్కర్లు అందరినీ ఎలాంటి షరతులు లేకుండా మెయిన్ వర్కర్లుగా మార్చాలన్నారు. వారి వేతనాలు పెంచాలని, సూపర్‌వైజర్ పోస్టులకు అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అంగన్‌వాడీలు, మినీ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలన్ని ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని, గతంలో చేసుకున్న మినిట్స్, ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. లేకపోతే భవిష్యత్‌లో జరగబోయే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశానికి ముందు సీపీఎం నాయకుడు సీతారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తరమ్మ, రామలక్ష్మి, పార్వతి, నారాయణమ్మ, సీఐటీయూ నాయకుడు ఎస్.వై.నాయుడు పాల్గొన్నారు.